# చాపకింద నీరు

"వెళ్ళొస్తానమ్మా", కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న శాంతి గేటు తీసుకొని వెడుతూ అంది. వెడుతూన్న కూతుర్ని కనుమరుగయ్యేదాకా చూశారు. స్వరాజ్యమ్మా, శ్రీనాధరావూ.

అమ్మాయికి పెళ్ళి చెయ్యాలి రోజుకు అయిదుసార్లయినా ఆమాట అనకపోతే శ్రీనాధరావుకు తోచదు.

"కుందనపు బొమ్మలా ఉంటుంది మనమ్మాయికేమిటి? రాజాలాంటి సంబంధమొస్తుంది". ధీమాగా అంది స్వరాజ్యమ్మ.

చిద్విలాసంగా నవ్వేడు శ్రీనాధరావు "కాకి పిల్లకాకికి ముద్దు", స్వరాజ్యమ్మ మొహంలో కోపం చూస్తూ అతను మాట మార్చేడు. "ఈ రోజుల్లో అందం చూసీ, గుణం చూసీ ఎవరు చేసుకుంటున్నారు. స్వరాజ్యం, మూటలు విప్పాలి."

"ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తే కట్నాలు పోతాయంటున్నారు కదా. మనమ్మాయి కాలేజీలో పనిచేస్తోంది. ఇక కట్నమెందుకు?"

భార్య అమాయకత్వానికి అతనికి జాలివేసింది.

"పిచ్చిదానా ఉద్యోగాలంటే ప్రైవేటు కాలేజీలో వెయ్యి రూపాయల ఉద్యోగాలు కావు. ఏ బ్యాంకులోనో, గవర్నమెంటులోనో ఆఫీసరయితే నెలకు అయిదారువేలు తెస్తుంది. అలాంటి జీతాలుంటే అవుతాయేమో."

ఆమె ఊరుకోలేదు. "మీ అక్కకు కట్నం లేకుండా కాలేదా?"

శ్రీనాధరావు మొహం గంభీరంగా మారిపోయింది. "మా అక్క విషయమే వేరు స్వరాజ్యం. మా అక్క మామగారు గాంధేయవాది, వీరేశలింగం గారి శిష్యుడూనూ. అయన ఆ రోజుల్లో వితంతు వివాహం చేసుకున్నారు. ఆయన ఎప్పుడూ స్త్రీ జనోద్ధరణకే పాటుపడేవారు. అందుకే వరకట్నం లేకుండా మా అక్కను కోడల్ని చేసుకున్నారు. ఈ రోజుల్లో అలా ఎవరున్నారు?"

స్వరాజ్యమ్మ ఏం మాట్లాడలేదు. అతనే ఇంకా మాట్లాడసాగేడు.

"నీకోసంగతి చెప్పనా స్వరాజ్యం. మా అక్కకి మాత్రం తనకి కట్నమిచ్చి ఇంకా మంచి సంబంధం మా నాన్నగారు తేలేదని అసంతృప్తి. మా నాన్న డబ్బుకి వెనకాడక పోతే తనో ఆఫీసరు భార్యనయివుండేదాన్నంటుంది. మా నాన్నగారికి కాబోయే వియ్యంకుల మంచితనం నచ్చింది. డబ్బు మాట ఇద్దరి మధ్యా అసలు రానేలేదు.

కట్నం తేలేదని మా అక్కను ఎవరూ చిన్న చూపు చూడలేదు. మా బావగారు చాలా మంచివారు. ఆఫీసర్లంటుందే కానీ బ్యాంకు వాళ్ళకి జీతాలేం తక్కువ ఉన్నాయా? మీ ఆడవాళ్ళు చాలా చిత్రం మనుషులు. వరకట్నం నశించాలని నినాదాలు చేస్తారు. కట్నం వద్దనే గుమాస్తా కావాలా కట్నం తీసుకునే ఆఫీసరు కావాలా అంటే ఈ కన్నె పిల్లలంతా ఏం చెప్తారో? మా అక్క కథయితే నాకు తెలును."

"కట్నం కోరని ఆఫీసరు రాకూడదా శాంతికి?"

"అదే నామాటాను. చూశావా? ఆశయ సిద్ధికి త్యాగం చెయ్యాలి. అం ఆరాళ్ ఆశయమూ సిద్ధించాలంటే ఎలా?"

ఇక మాటలు లేవన్నట్లుగా స్వరాజ్యమ్మ లోపలకు వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

వెయ్యేళ్ళాయుష్షు అన్నట్లుగా అరగంటకే రిక్షాలోంచి దిగారు శ్రీనాథరావు బావగారు. శ్రీనివాసూ, అక్క అలివేలూ సాదరంగా లోపలకు ఆహ్వానించేరు ఇద్దర్నీ. ఏపండగాలేదు. సెలవులూ లేవు ఇప్పుడెందుకు వచ్చారో అనుకుంది స్వరాజ్యమ్మ. ఆఫీసు పనికావచ్చనుకుంది.

రాత్రిభోజనాల దగ్గర అసలు కారణం బయటపడింది.

"మీ అక్క ముచ్చట పడుతోందని ఇల్లు కట్టేపని మొదలెట్టాను బావగారూ. ఏదో చిన్నది. ఒక సొంత కొంప వుంటే బావుంటుందని నాకూ అన్పించిందనుకోండి. మా నాన్నగారి సంగతి తెలుసుకదా. అయన ఆశయాలే అయనవి. మాకో సెంటు భూమైనా ఇవ్వలేదు. మనమూ పిల్లల కలా చేస్తే ఎలా? రోజులు మారుతున్నాయి కదా ఎంతో కొంత వెనకెయ్యాలి."

అలివేలు అందుకుంది "అవున్రా తమ్ముడూ, నీకైతే నాన్న కట్టించిన ఇల్లుంది. మాకైతే అన్నీ మేమే ఏర్పాటు చేసుకోవాలి."

గోడలు పగిలిపోయి, పైనుంచి వానకురిసే ఇంటిని చూసి శ్రీనాథరావు చిన్నగా నవ్వేడు. అలివేలు ఇంకా మాట్లాడుతోంది.

"ఆరోజుల్లో మామామగారు వద్దన్నారని కట్నమూ ఇవ్వలేదు. ఇటు ఆస్తిలో భాగమూ ఇవ్వలేదు. చదువూ నీకే చెప్పించారు. ఆస్తీ నీకే కట్టబెట్టారు." బతకలేక బడిపంతులని తనకు బిఇడి చెప్పించారు. పెంకుటిల్లిచ్చారు. తనకి తండ్రి మీద ఏకోపమూ లేదు. అక్కకు మాత్రమెందుకో, శ్రీనాథరావుకి అంతు పట్టలేదు. కొద్దిగా మొహంలో కోపచ్ఛాయలు కన్పించాయి. అది కనిపెట్టినట్లుగా శ్రీనివాస్ ఆమెను ఆపుతూ లౌక్యంగా అన్నాడు.

"ఇప్పుడా పాత గొడవలన్నీ ఎందుకు? డబ్బుదేముంది ఈ రోజు వుంటుంది రేపు పోతుంది. మనిషికి మంచి ముఖ్యం. మనం మళ్ళీ ఎల్లుండి ప్రొద్దుటే వెళ్ళిపోవాలి. విషయం మాట్లాడితే మంచిది. అయినా నువ్వు కావాలనుకున్నాను కానీ డబ్బు కావాలనుకోలేదు కదా."

చూశావా మా బావగారెంత మంచివారో అన్నట్లు చూశాడు శ్రీనాధరావు భార్యవైపు.

"అదేమిటి అప్పుడే వెళ్ళిపోవడం".

"సెలవు లేదు బావగారూ"

"పిల్లల్ని వదిలేసి వచ్చాంరా తమ్ముడూ.. పని తప్పనిసరి కాబట్టి బయల్దేరాం."

పనేమిటన్నట్లు చూశాడు శ్రీనాధరావు

"ఏం లేదు బావగారూ. చేతిలో డబ్బుతో మొదలెట్టాను. మా బ్యాంకులోను రావడానికి టైం పడుతుంది. ఎల్.ఐ.సి.కి కూడా పెట్టాను. కానీ అదీ ఇంకా రాలేదు. కార్తీకం దాటితే మూఢమంటున్నారు. ఈలోగా పూర్తిచేసి గృహప్రవేశమవ్వాలని మీ అక్క అంటోంది.

మీరేమైనా సర్దగలరేమోనని వచ్చాం" "నేనా? నా దగ్గరంతెలావుంటుంది?"

"ఇల్లుందిగా, ఇంటిమీద అప్పిస్తారుగా" అంది అలివేలు

"ఇంటిమీదా"

"అవునులే ఇంటి మీదెందుకు తెస్తావు. నాన్న నీకిచ్చిన ఇల్లు" రెచ్చిపోతూ అంది అలివేలు.

శ్రీనివాస్ ఉద్రిక్తత తగ్గిస్తూ అన్నాడు. "నువ్వుండు అలివేలూ, ఇల్లుకాదు కానీ మీ శాంతి పుట్టినప్పుడు మీ చేత రికరింగ్ ఓపెన్ చేయించాను. జ్ఞాపకముందా. అంది మీరింకా కడుతున్నారా?

ఆ మాట నిజమే. శాంతి పుట్టినప్పుడు శ్రీనివాస్ సలహా ఇచ్చాడు. అమ్మాయి భవిష్యత్తుకుంటుంది. నెలనెలా దాచమని. ఆ సలహా శ్రీనాధరావుకి నచ్చింది. ఇంటికి అద్దెలేదు. ఆ అద్దెడబ్బు ప్రతి ఏడూ ఎంత అవుతుందో లెక్కకట్టి దాస్తూ వచ్చాడు. నెలకి యాభైతో మొదలైంది. ఇప్పుడు నెలకి ఎనిమిది వందలయింది. సలహా ఇచ్చిన బావగారంటే అందుకే అభిమానం. శాంతకి పెళ్ళి కుదిరితే డబ్బుకు తడుముకో నక్కరలేదు.

"డిపాజిట్ కడుతూనే వున్నాను"

"దానిమీదలోనిస్తారు. అడబ్బివ్వండి. మా బ్యాంకులోనో, ఎల్.ఐ.సి.లోనో రాగానే ఆ డబ్బు మీకు వెంటనే ఇచ్చేస్తాను"

"అది శాంతి పెళ్లికని దాస్తున్నాము బావగారూ"

"వర్రీ అవకండి మీరెప్పుడంటే అప్పుడు తెచ్చి ఇచ్చేస్తాను. అంతే కాదండోయ్ బ్యాంకు వాళ్ళు అప్పు మీద తీసుకునే హెచ్చువడ్డీ కూడా నేనే కడతాను. నా లోన్ రాకపోవడం వల్ల ఈ ప్రాబ్లం వచ్చింది. లేకపోతే మిమ్మల్ని ఇబ్బంది పెడుదునా?"

నమ్మకంగా చెప్తున్న బావగారి మాటలకి ఏం చెప్పాలో తెలియలేదు శ్రీనాధరావుకి. కట్నం లేకుండా చేసుకుని, అక్కగారిని దేవతలా ఆదరిస్తున్న బావగారంటే అభిమానమూ, గౌరవమూ ఉన్నాయతనికి. శాంతి పెళ్లికి కదా కావల్సింది తనకు. ఈలోగా లోన్ రాగానే ఇచ్చేస్తామంటున్నారుగా. ఆదుకుందుకు కాకపోతే ఆప్త బంధువులన్న మాట ఎందుకు?

శ్రీనాథరావు "అలాగే బావగారూ రేపు వెడదాం బ్యాంకుకు" అన్నాడు.

❖ ❖ ❖

మర్నాడు బ్యాంకు కెళ్ళారు బావమరుదులిద్దరూనూ. 50 వేల దాకా అప్పు తీసుకోవచ్చన్నారు బ్యాంకులో. మీకెంత కావాలని అడిగేడు శ్రీనాథరావు. శ్రీనివాస్ అంతా తీసుకుంటాను. మళ్ళీ మధ్యలో పని ఆగిపోతే కష్టం. పనివాళ్ళు దొరకరు. అయినా ఎంతకాలంలెండి ఓనెలో, రెండునెలలో తీర్చేస్తానుగా అన్నాడు. చాలా సంతకాలు పెడితే కానీ బ్యాంకు వాళ్ళు డబ్బివ్వలేదు. ఆ డబ్బు వెంటనే బావగారికిచ్చేడు శ్రీనాథరావు. చాలా థాంక్స్ అంటూ బ్రీఫ్‌కేసులో పెట్టుకున్నాడతను.

సొంత పనిమీద వస్తేనేమి ఇంటికొచ్చిన ఆడపడుచుకు చీర పెట్టడం విధాయకం. అలివేలు కొత్తచీర కట్టుకునే వెళ్లింది.

❖ ❖ ❖

మూడు నెలల తర్వాత శ్రీనివాస్ నుంచి గృహప్రవేశానికి రమ్మని శుభలేఖా, అత్తింట్లో తనపరువు నిలబడేలా పీటల మీదకి మంచి బట్టలు తెమ్మని అలివేలు నుంచి ఉత్తరమూ వచ్చాయి. అక్కా బావలిద్దరికీ బట్టలు కొన్నాడు శ్రీనాథరావు. గృహ ప్రవేశానికి స్వరాజ్యమ్మా, శ్రీనాథరావు వెళ్ళారు. కొత్త ఇల్లేమో - కళ కళ లాడుతోంది

మామిడాకులతో. ఇంటికి పెట్టిన పేరు చూస్తూ నిల్చున్న శ్రీనాథరావుతో "మామగారి జ్ఞాపకంగా ఆదర్శదర్శిని అని పేరు పెట్టాము. ఆయనవన్నీ ఆశయాలేగా" అంది అలివేలు.

◆ ◆ ◆

గృహ ప్రవేశం చాలా గ్రాండుగానే చేశారు శ్రీనివాస్ దంపతులు. కనీసం పదిహేను వేలయినా అయి వుంటుంది అనుకున్నాడు శ్రీనాథరావు. బావగారు తనకివ్వాల్సిన పైకం సంగతి మాట్లాడలేదు. శ్రీనాథరావు పరిస్థితి చాలా ఇబ్బందిగా వుంది.

మెల్లిగా అతనొక్కడూ ఉన్నప్పుడు అడిగాడు "లోన్ వచ్చిందాండీ"

"వచ్చిందండీ మీ అక్కపైన గదివేయిస్తే వేసవిలో బావుంటుందంది. మార్బల్ ఫ్లోరింగ్. ఆడవాళ్ళ ముచ్చట్లు కాదనలేం కదా. మీరేం వర్రీ కావద్దు నేనుకొన్న షేర్లన్నీ బ్రహ్మాండంగా పెరుగుతున్నాయి. మంచి ధర రాగానే మీ బాకీ తీర్చేస్తాను." ఇంకేం మాట్లాడాలో తెలియలేదు శ్రీనాథరావుకి

◆ ◆ ◆

అనుకోకుండా శాంతికి ఓ మిత్రుడి ద్వారా మంచి సంబంధం కుదిరింది. మగపెళ్ళివారు యాభైవేలు కట్నమూ, పదితులాల బంగారం, మిగతా లాంఛనాలు అడిగేరు. సరేనన్నాడు శ్రీనాథరావు. ఎలాగూ డిపాజిట్ అయిపోతోంది. మంచి సంబంధం దాట బెట్టుకుంటే కష్టం అని వెంటనే ఒప్పుకున్నాడు. ఉన్నంతలో మగ పెళ్ళివారూ మంచి వాళ్ళలాగే కనిపించారు.

మీకు వెంటనే డబ్బు సర్దుబాటు కావడం కష్టం కావచ్చండీ. ఎటొచ్చీ మాకు ఖర్చులుంటాయి. అందుకని కట్నంలో పదివేలు ముందిప్పుడే ఇచ్చెయ్యండి అన్నాడు కాబోయే వియ్యంకుడు.

ఆరోజునే బ్యాంకుకు వెళ్ళాడు శ్రీనాథరావు. డిపాజిట్ తాలూకు డబ్బు పదకొండువేల చిల్లరుంది. ఆశ్చర్యంతోటీ, ఆందోళనతోటీ చూశాడతను. క్లర్కు "దగ్గర దగ్గరగా ఏడాదవుతోంది కదా, మీరు లోన్ తీసుకున్న అసలూ, వడ్డీ తీసేసి మిగతాదే ఇస్తున్నామ"న్నాడు. ఇచ్చేస్తారులే బావగారు అన్నట్లు ఇన్నాళ్ళు ఊరుకున్నాడు. ఇప్పుడు గట్టిగా అడగాలి అనుకున్నాడు అతను.

వచ్చిన పదకొండు వేలలో పదివేలు శాంతి కాబోయే మామగారికిచ్చేడు. శాంతికి

వివాహం కుదురిందనీ, తనపైకం వెంటనే పంపించమనీ బావగారి పేర ఉత్తరం వేశాడు. రెండు వారాలైనా జవాబు లేదు. ముహూర్తం ఇంకా నెలా పదిహేను రోజులుంది.

"ఫోను చేసి చూడండి" అంది స్వరాజ్యమ్మ

ఆఫీసు నంబరుకి ఫోను చేశాడు. శ్రీనివాస్ ఫోన్ దగ్గరకు వచ్చి "మీ డబ్బు తొందరలోనే పంపేస్తానండీ. షేర్లు ఈవారం తగ్గాయి. వచ్చేవారం పెరుగుతాయంటు న్నారు. వచ్చే ఆదివారానికి మీ డబ్బు రెడీ" అన్నాడు.

ఇంటికొచ్చి "నేను చెప్పేనుగా మా బావగారు చాలా మంచివారు. డబ్బు ఇవ్వరని అనుకోవడం తప్పు" అన్నాడు శ్రీనాథరావు.

స్వరాజ్యమ్మ "పోనీ మీ పిఎఫ్‌కి అప్లై చెయ్యండి" అంది.

"ఆ డబ్బు అబ్బాయి చదువుకనుకున్నాంగా. ప్రావిడెండ్ ఫండ్ దేనికి ఆయన ఇచ్చేస్తానన్నారుగా."

◆ ◆ ◆

ఆదివారం వచ్చి వెళ్ళిపోయింది. మంగళవారం మళ్ళీ ఫోను చేశాడు.

"మా బ్రోకర్ అనుకున్న రోజున ఇవ్వలేదండీ. మీరు నా మీద భరోసా ఉంచండి. మా ఆవిడ నగలు తాకట్టు పెట్టైనా మీ డబ్బు ఇచ్చేస్తాను. గురువారం మీ డబ్బురెడీ."

"అయితే గురువారానికి మీ ఊరొస్తాను. మళ్ళీ మీరు పంపించడంతో టైం పోతుంది కదా."

శ్రీనివాస్ మాట్లాడకుండా ఫోన్ కట్ చేశాడు.

◆ ◆ ◆

గురువారానికి శ్రీనివాస్ వాళ్ళ ఊరెళ్ళాడు శ్రీనాథరావు. అలివేలు ముభావంగా పలకరించింది. కాస్సేపు చూసి "బావగారు లేరా" అని అడిగేడు.

"డబ్బు వసూలు కొచ్చావా? ఆయన బంధువులెవరికో ఒంట్లో బాగులేకపోతే వెళ్ళారు. నీకెప్పుడూ డబ్బు రంధియే. ఆయనతో ఫోన్లో మాట్లాడేవే అన్నిసార్లు. అక్కెలా వుంది అని ఒక్కసారైనా అడిగేవా?" ఎస్.టి.డి. ఖర్చు తనది కాకపోతే ఎంతసేపైనా మాట్లాడవచ్చు అన్నట్లుగా అంది అలివేలు.

"సరే నేను వచ్చి వెళ్ళానని బావగారితో చెప్పు" అంటూ లేచాడతను. ఆ పూట భోంచేసి వెళ్ళు అని కూడా అనలేదు అలివేలు.

❖ ❖ ❖

ఇంటికొచ్చిన భర్తకేసి ఆత్రంగా చూసింది స్వరాజ్యమ్మ

"బావగారు ఊళ్ళో లేరు. వచ్చాక పంపిస్తారనుకుంటాను" అన్నాడతను.

"అంతవరకూ పనులాగవుకదా. కళ్యాణ మంటపానికీ, బట్టలకీ, భోజనాలకీ అన్నిటికీ డబ్బు కావాలి. మీ పి.ఎఫ్. వచ్చేటైం కూడా లేదు ఎలా."

"ఇంటి మీద అప్పు తెద్దాం. బావగారు పంపగానే అప్పు తీర్చేసి కట్నమివ్వచ్చు" పాత ఇంటికి ఎక్కువ రాదని పదిహేను వేలు ఇచ్చాడు షావుకారు. స్వరాజ్యం గాజులూ, మెళ్ళో గొలుసూ మార్చి శాంతికి బంగారం చేయించారు. చేతిలో డబ్బు యమస్పీడుతో పరిగెట్టసాగింది.

శుభలేఖతో పాటు తన పరిస్థితి వివరిస్తూ ఉత్తరం రాసివేశాడు శ్రీనాథరావు.

ముహూర్తం టైంకి పట్టుకుని వస్తారేమో డబ్బు అని అనుకున్నాడతను.

❖ ❖ ❖

ముహూర్తం టైం దగ్గర పడింది. పెళ్ళి వారంతా వచ్చేశారు. అలివేలు ఒక్కర్తీ వచ్చింది.

"బావగారు రాలేదా?"

"అయనకు జ్వరం. ఒక్కగానొక్క మేనకోడలు. నువ్వెళ్ళిరా అని నన్ను పంపించారు. ముహూర్తం కాగానే వెళ్ళిపోతాను."

పెళ్ళి సన్నాహాలు సాగుతున్నాయి. మగపెళ్ళివారి విడిది నుంచి కబురు వచ్చింది. శ్రీనాథరావు వెళ్ళేడు.

"బావగారూ, కట్నం తాలూకు డబ్బు ఇచ్చేస్తే బావుంటుంది. ఇదేం సినిమా కాదు. పీటలమీద కూచున్నాక ఒరేయ్ అబ్బాయ్ లేచిరా అనడానికి ముందే అకౌంట్ సెటిల్ చేసుకుందాం"

"అలాగే ఇప్పుడే తెచ్చి ఇస్తాను."

❖ ❖ ❖

వెనక్కి వచ్చిన శ్రీనాధరావు అలివేలుని అడిగేడు "అక్కా, బావగారు నీ చేతికి డబ్బేమైనా ఇచ్చేరా?"

"శాంతికి చదివించమని నూట పదహార్లిచ్చేరు. బోలెడు ఖర్చులో ఉంటాడు మీ తమ్ముడు అంటూ తిరుగు చార్జీలు కూడా ఇచ్చారు"

"అదికాదక్కా అప్పుడు ఇంటికోసం తీసుకున్నారే ఆ డబ్బు"

"ఏమో ఏం తీసుకున్నారో నాకా వివరాలేం తెలియవు. ఆయనకిచ్చేవు. ఆయనను అడక్క ఆడదాన్ని నన్నడుగుతావేం. హెచ్చు వడ్డీకి ఆశపడ్డావు. ఇచ్చేవు. ఈ ఇంట్లో ఎప్పుడూ డబ్బు గొడవే. నాన్నా అంతే కట్నం డబ్బులు మిగుల్తాయని నా గొంతుక్కోశాడు." ఆమె ధోరణి ఆగలేదు.

తమ హెచ్చు వడ్డీకి ఆశపడ్డాడా. శ్రీనాధరావుప్రాన్నడిపోయాడు.

శ్రీనాధరావు దగ్గర కట్నం లేదన్న సంగతి మగపెళ్ళివారికి తెలిసిపోయింది. పెళ్ళికొడుకు తండ్రి విడిది నుంచి వచ్చాడు.

"ఏమండీ బావగారూ. ఏమిటి సంగతి?"

"బావగారూ. ఇవి చేతులు కావు కాళ్ళు"... అతని మాటలు ఆపుతూ పెళ్ళికొడుకు తండ్రి ఇలా మాట్లాడేడు.

"ఇంకొంతకాలం ఆగమంటారు. నాకూ ఆడపిల్ల ఉంది. ఆమెకు ఏభైవేలతో సంబంధం కుదుర్చుకున్నాం. మీరిచ్చిన డబ్బు అలా ఇచ్చేద్దామనుకున్నాను. నాక్కాబోయే వియ్యంకుడు తెలివైనవాడు. అంతా ముందే ఇచ్చెయ్యమన్నాడు. నాకే ఆ తెలివిలేకపోయింది. ఇక్కడ మీ అమ్మాయి గురించి నేను ఆలోచిస్తే అక్కడ మా అమ్మాయి గతేం కావాలి?"

ఆయన విసవిసా వెళ్ళిపోయాడు.

"అందరూ మా మామగారంత వెర్రివాళ్ళుండరు". అంది అలివేలు

స్వరాజ్యమ్మ కోపంతో భగ్గున మండిపడింది.

"మీ ఆయనంతా నీ అంతా తెలివైన వాళ్ళూ వుండరు. అంతకింతా రాబట్టుకున్నారుగా. అటు కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నారన్న పేరూ ఉంది. ఇటు అత్తవారింటి నుంచి లాగ్గలిగినంతా లాగేశాడు మీ ఆయన. ఇలా చేసి మీ ఇద్దరూ బాగుపడదామనుకుంటున్నారేమో. తీసుకు తీసుకు చస్తారు" కన్నకూతురు పెళ్ళిపీటల

పై ఆగిపోయిందన్న దుఃఖమూ, ఇంకో సంబంధం వెతికి పెళ్ళి చెయ్యలేమోనన్న భయమూ ఆమెలో వివేకాన్నీ, విచక్షణనీ చంపేశాయి.

అలివేలు అలిగి రిక్షా ఎక్కి వెళ్ళిపోయింది.

శాంతి కళ్ళు తిరిగి పడిపోయింది. స్వరాజ్యమ్మ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"పోనీలే ఎవరిపాపం వాళ్ళది. శాంతికింకా మంచి సంబంధం వస్తుందేమో" ఓదారుస్తున్నట్లుగా అన్నాడు శ్రీనాథరావు. భర్తది చేతకాని తనమా, మంచితనమా? స్వరాజ్యమ్మకి పాలు పోలేదు.

❖ ❖ ❖

పీటలమీద పెళ్ళి తప్పిపోయిందన్న వార్త పందిట్లో గుప్పమంది. కట్నం కోసం కన్యజీవితం నాశనం చేశారని మగపెళ్ళి వార్ని తిట్టారు. ఆమాత్రం డబ్బు ముందు రెడీ చేసుకోకుండా కూతుర్ని నట్టేట ముంచేరని ఆడపెళ్ళి వార్ని తిట్టారు.

పెళ్ళికొచ్చిన వారంతా విసుగుతో, ఆకలితో ఇంటి ముఖం పట్టారు.

"ఆదర్శ దర్శిని" ఇల్లు మాత్రం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఆ ఇంటి యజమానుల విజయోత్సాహాలతో కూడిన మొహాల్లాగే.

(ఆహ్వానం)